సాక్షి జగిత్యాల
శుక్రవారం । 17 । నవంబర్ । 2023



పోలింగ్ కేంద్రాల పరిశీలన
సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను కోరుట్ల సీఐ ప్రవీణ్, ఎస్‌బీ డీఎస్పీ, ధర్మపురి నోడల్ అధికారి రవీంద్రకుమార్ పరిశీలించారు.
10లో▸



వందశాతం పోలింగ్‌కు చర్యలు
ఈసీ 2018 ఎన్నికల్లో ఈవీఎంలకు వీవీపాట్‌లను ఏర్పాటు చేసి, ఓటరు ఏ గుర్తుకు ఓటు వేశారో తెలుసుకునే అవకాశం కల్పించింది.
10లో▸



వాతావరణం
వాతావరణం పొడిగా ఉంటుంది. ఉదయం మంచు కురుస్తుంది. మధ్యాహ్నం ఎండవేడిమి పెరుగుతుంది. సాయంత్రం నుంచి చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

కొండగట్టులో ఎంపీ పూజలు


ముడుపు కడుతున్న ఎంపీ

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్న స్వామిని గురువారం నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ దర్శించుకున్నారు. అర్చకుల పూజల మధ్య స్వామివారికి ముడుపు కట్టారు.

మల్యాలలో కేంద్రబలగాల కవాతు


కవాతులో సాయుధ బలగాలు

మల్యాల: మండలకేంద్రంలో కేంద్ర సాయుధ బలగాలు, స్థానిక పోలీసులు గురువారం కవాతు నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రధాన రహదారి వెంట కవాతు చేపట్టారు. డీఎస్పీ వెంకటస్వామి, సీఐ బిల్లా కోటేశ్వర్, ఎస్సైలు అశోక్, కుమారస్వామి, సతీశ్, వెంకట్రావ్ తదితరులు పాల్గొన్నారు.

చక్కెర ఫ్యాక్టరీల కోసమే సీఎంపై పోటీ


మాట్లాడుతున్న రైతు ఐక్యవేదిక నాయకులు

జగిత్యాలఅగ్రికల్చర్: రాష్ట్రంలో మూతపడిన షుగర్ ఫ్యాక్టరీలను తెరిపించాలనే డిమాండ్‌తో గజ్వేల్‌లో సీఎం కేసీఆర్‌పై పోటీ చేస్తున్నామని జిల్లా రైతు ఐక్యవేదిక ప్రతినిధులు మామిడి నారాయణ రెడ్డి, బద్దం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఫ్యాక్టరీలను తెరిపించాలని రైతులు పోరాడుతున్నా బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఫ్యాక్టరీలు తెరిపిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చిన వారికే రైతులు ఓటు వేస్తారని పేర్కొన్నారు. ఆయన వెంట ఐక్యవేదిక నాయకులు క్యాతం సాయిరెడ్డి, కోల నారాయణ, ఎస్.తిరుపతి, ఎం.రాంరెడ్డి, వంగ అశోక్ యాదవ్ ఉన్నారు.

రాయికల్‌కు రాములోరి పాదుకలు


పాదుకలను చూపుతున్న స్వాములు

రాయికల్: అయోధ్యలోని రామునిపాదుకలు గురువారం రాయికల్‌కు చేరాయి. శ్రీరామ పాదుకలను పట్టణంలోని శివాజీ విగ్రహం, గాంధీవిగ్రహం, పాతబస్టాండ్ నుంచి చెన్నకేశవనాథ ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. రాములోరి పాదుకలను మోయడానికి భక్తులు పోటీపడ్డారు. కార్యక్రమంలో సామల్ల సతీశ్, ఎలగందుల రమేశ్, తుమ్మల సదాశివ రెడ్డి, అయోధ్యకు చెందిన అర్చకులు శ్రీనివాస్‌శాస్త్రీ, సుధాకర్, పద్మనాభస్వామి, దేవమణి, కోటేశ్వర్‌రావు, కామేశ్వర్‌రావు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఉపన్యాస పోటీలకు మూటపల్లి విద్యార్థి


రక్షితను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రాయికల్: రాయికల్ మండలం భూపతిపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన బొడ్డుపల్లి రక్షిత రాష్ట్రస్థాయి ఉపన్యాస పోటీలకు ఎంపికైంది. గురువారం జగిత్యాలలో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ జ్ఞాన ప్రతిష్ఠ, తెలంగాణ సాంఘికశాస్త్రం ఉపాధ్యాయ ఫోరం ఆధ్వర్యంలో మానవ జీవన విధానంలో ప్రకృతి పాత్ర అనే అంశంపై నిర్వహించిన పోటీల్లో రక్షిత ప్రథమస్థానం సాధించిందని సాంఘికశాస్త్రం ఉపాధ్యాయుడు దాసరి రామస్వామి తెలిపారు. రక్షితను సర్పంచ్ చంద్రశేఖర్, ఎస్ఎంసీ చైర్మన్ జక్కుల ప్రసాద్, ప్రధానోపాధ్యాయురాలు రమణి, ఉపాధ్యాయులు సామర్ల గంగాధర్, సిరిపురం మహేశ్, గంగరాజు, బొల్లె చిన్నయ్య, రాపర్తి నర్సయ్య, తిరుమల, పీఈటీ బందెల శ్రీను అభినందించారు.

పోలింగ్ కేంద్రాల్లో నిఘా

- వెబ్‌కాస్టింగ్ ఏర్పాటుకు సన్నాహాలు
- అన్ని సెంటర్ల వద్ద పోలీస్ బందోబస్తు
- కొండగట్టు జేఎన్‌టీయూ విద్యార్థులకు శిక్షణ


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

జగిత్యాల: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. గతంలో మాదిరిగా పొరపాట్లు చోటుచేసుకోకుండా పోలింగ్ కేంద్రాల వద్ద ఇప్పటికే భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. పారదర్శకంగా, సమర్థవంతంగా పోలింగ్ నిర్వహణకు ఇంటర్నెట్‌ను సైతం వినియోగిస్తున్నారు. ముఖ్యంగా జిల్లాలోని మారుమూల, సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి వెబ్‌కాస్టింగ్ ద్వారా పటిష్ట నిఘా కోసం చర్యలు చేపడుతున్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి గొడవ జరగకుండా చూసేందుకు ఎప్పటికప్పుడు పోలింగ్ జరిగే ప్రక్రియను నిరంతరం పర్యవేక్షణ చేయనున్నారు. వెబ్‌కాస్టింగ్‌కు సీసీకెమెరాలు బిగిస్తున్నారు. వెబ్‌కాస్టింగ్ నిర్వహణకు సంబంధించి ఇప్పటికే ఉన్నతాధికారులు ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకోవాలని, అవసరమైన మేరకు కంప్యూటర్ పరిజ్ఞానం గల యువతను వెబ్‌కాస్టింగ్ కోసం వినియోగించుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు కలెక్టర్ యాస్మిన్ బాషా వెబ్‌కాస్టింగ్ కోసం జిల్లాలోని నాచుపల్లి జేఎన్‌టీయూకు చెందిన 500 మంది విద్యార్థులను వినిగించుకునేందుకు ప్రతిపాదించారు. వారందరికీ పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కూడా కల్పించారు.

పటిష్ట నిఘా

కొన్ని కేంద్రాల్లో ప్రధాన పార్టీల అభ్యర్థుల మధ్య గొడవలు చోటుచేసుకుంటాయి. దీంతోపాటు ఓటర్లను ఆకట్టుకునేందుకు మద్యం, డబ్బులు, బహుమతులు పంపిణీ చేస్తుంటారు. ఈసారి ఎన్నికల్లో అలాంటి వాటిని నియంత్రించేందుకు అధికారులు ప్రత్యేక నిఘా సారిస్తున్నారు. మరోవైపు దొంగనోట్లు వేయకుండా.. అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ఈ వెబ్‌కాస్టింగ్ పద్ధతిని కేంద్రాల్లో అమలు చేస్తారు. ఇప్పటికే జేఎన్‌టీయూ విద్యార్థులకు పోలింగ్ కేంద్రాల్లో వీటి నిర్వహణపై అవగాహన సైతం కల్పించారు. వారికి ప్రత్యేక శిక్షణతోపాటు, భృతి కూడా చెల్లించనున్నారు. ఈ వెబ్‌కాస్టింగ్ ద్వారా పోలింగ్ సరళిని నిరంతరం కలెక్టరేట్‌లో ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించవచ్చు. ఏవైనా ఘర్షణలు జరిగినా పోలింగ్ కేంద్రాల్లో ఇబ్బందులు జరిగినా పోలీసు బలగాలు సిద్ధం చేసేందుకు ఈ వెబ్‌కాస్టింగ్ ఉపయోగపడుతుంది. వీడియో రికార్డింగ్‌తో గొడవలు జరిగినా.. ఇట్టే తెలిసిపోతుంది. ఘర్షణలకు దిగిన వారిపై కేసులు నమోదు చేసే అవకాశం కూడా ఉంది.

పోలింగ్ కేంద్రాలు	సమస్యాత్మకం	వెబ్‌కాస్టింగ్
785	248	458

విద్యార్థులను వినియోగిస్తాం



ఈసారి ఎన్నికల్లో వెబ్‌కాస్టింగ్ చేపడుతున్నాం. ఇందుకు జిల్లాలోని నాచుపల్లి జేఎన్‌టీయూకు చెందిన 500 మంది విద్యార్థుల సేవలను వినియోగిస్తాం. వారికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పిస్తాం. వెబ్‌కాస్టింగ్ నిర్వహణ పకడ్బందీగా చేపడతాం.
– యాస్మిన్ బాషా, జిల్లా ఎన్నికల అధికారి,జిల్లా కలెక్టర్

ఓటేయడం నైతిక బాధ్యత

- కలెక్టర్ యాస్మిన్ బాషా


మాట్లాడుతున్న కలెక్టర్

జగిత్యాల: ఓటు హక్కును ప్రతిఒక్కరూ నైతిక బాధ్యతగా భావించి ఓటేయాలని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఎన్నికల ప్రచారం కోసం అవసరమైన మైక్, వాహనాల వినియోగాల అనుమతులకు సువిధ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని, ఇతర ప్రచార పత్రాలు, ఫ్లెక్సీలు, పోస్టర్లు, ఆడియో, వీడియో, లెడ్ వాహనాల అనుమతులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎన్నికల సిబ్బంది మోడల్ కోడ్‌ను ప్రభుత్వయంత్రాంగం పకడ్బందీగా అమలు చేస్తుందని పేర్కొన్నారు. సీ విజిల్ యాప్‌ను జిల్లాలో ఇప్పటివరకు 30వేల మంది డౌన్‌లోడ్ చేసుకున్నారని, బరిలో ఉన్న అభ్యర్థులు కూడా డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. అభ్యర్థులు ఖర్చులను ఎప్పటికప్పుడు రాసుకోవాలని, హ్యాండ్‌బుక్కు, ఖర్చుల బుక్కులు సమర్పించాలని, వ్యయాలకు సంబంధించిన రికార్డులను మూడుసార్లు తనిఖీ చేస్తామని పేర్కొన్నారు. సమస్య ఉంటే 1950 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. 80ఏళ్లుపైబడిన వృద్ధులు, 40శాతం మించి అంగవైకల్యం ఉన్నవారు ఇంటివద్దనే ఓటు వేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈవీఎం మాక్ పోలింగ్ సమయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు అందుబాటులో ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్లలోపు ప్రచార కార్యక్రమాలు నిర్వహించకూడదని, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అభ్యర్థి క్రిమినల్ కేసులకు సంబంధించిన వివరాలు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో నిర్ణీత గడువులోపు మూడుసార్లు ప్రచురించాలని తెలిపారు. ఓటర్లు 12 రకాల ఫొటోగుర్తింపు కార్డులలో ఏదైనా ఒక కార్డుతో ఓటు వేసేందుకు వెళ్లవచ్చన్నారు. ఓటరు స్లిప్‌లు పంపిణీ చేస్తామన్నారు. సాధారణ పరిశీలకులు బసవ రాజేంద్ర, రంజన్ మీనా, ఆర్డీవోలు నర్సింహమూర్తి, రాజేశ్వర్ పాల్గొన్నారు.

తెలంగాణను ఢిల్లీ పాలకులకు తాకట్టు పెట్టొద్దు

- ఓయూ జేఏసీ చైర్మన్లు
- బీఆర్ఎస్‌కు మరోసారి అవకాశమివ్వాలని విజ్ఞప్తి


మాట్లాడుతున్న జేఏసీ చైర్మన్లు

ధర్మపురి: అనేకమంది బలిదానాలు చేసి కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రాన్ని ఢిల్లీ పాలకుల చేతిలో పెట్టొద్దని ఉస్మానియా విశ్వవిద్యాలయం, శాతవాహన యూనివర్సిటీల జేఏసీ చైర్మన్లు మాందాల భాస్కర్, చిన్నమల్ల చైతన్య విజ్ఞప్తి చేశారు. పట్టణంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్రం వచ్చాక అన్నిరంగాలు అభివృద్ధి చెందుతున్నాయని, సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని తెలిపారు. మరోసారి అధికారం అప్పగిస్తే మరింత అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, జెడ్పీటీసీ బత్తిని అరుణ, ఆకుల రాజేశ్, గడ్డం బాల్‌రాజ్ ఉన్నారు.

మాయగాళ్లను నమ్మితే నట్టేట ముంచుతారు

- ధరణి తీసేస్తమంటున్న కాంగ్రెస్‌ను తరమండి
- దేశంలో ఎక్కడాలేని విధంగా సంక్షేమ పథకాలు
- కోరుట్ల ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



వెల్లుల్లలో మాట్లాడుతున్న కవిత, చిత్రంలో బీఆర్ఎస్ అభ్యర్థి సంజయ్, ప్రచారం చేస్తున్న దీప్తి

మెట్‌పల్లిరూరల్: వచ్చే ఎన్నికల్లో మాయగాళ్లను నమ్మితే నట్టేట ముంచుతారని నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. గురువారం కోరుట్ల బీఆర్ఎస్ అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్‌కి మద్దతుగా నియోజకవర్గవ్యాప్తంగా ప్రచారం చేశారు. మెట్‌పల్లి మండలం బండలింగాపూర్, వెల్లుల్లలో కవితకు బీఆర్ఎస్ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ధరణి తీసేస్తామని, మూడు గంటలే కావాలని అంటున్న కాంగ్రెస్‌ను నమ్మొద్దన్నారు. ఎంపీపీ మారుసాయి రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

దేశంలోనే తెలంగాణ నంబర్ వన్

ఇబ్రహీంపట్నం: తెలంగాణ పథకాలు దేశంలోనే నంబర్‌వన్‌గా ఉన్నాయని కవిత అన్నారు. ఇబ్రహీంపట్నంలో రోడ్‌షో నిర్వహించారు. ప్రజలు ఆశీర్వదిస్తే సంజయ్ ఎమ్మెల్యే అవుతారని, ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఎంపీపీ జాజాల భీమేశ్వరి, జెడ్పీటీసీ భారతి, సర్పంచు నేమూరి లత, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎలాల దశరథ్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మోసపోతే గోసపడతాం: ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

ఎన్నికలు రాగానే వచ్చేవారిని నమ్మితే మోసపోతామని ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు అన్నారు. బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ఈ ప్రాంత అభివృద్ధికి చేసిందేమిటో చెప్పాలన్నారు. బీజేపీని నమ్మితే బతుకులు ఆగమేనని బీఆర్ఎస్ అభ్యర్థి సంజయ్ అన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉండగా చేసిందేమిటో చెప్పాలన్నారు.

మూడు గంటలా..? 24 గంటలా..

మల్లాపూర్: కాంగ్రెస్ వస్తే మూడు గంటలే కరెంట్ ఇస్తుందని, అదే బీఆర్ఎస్ వస్తే 24 గంటలు ఉంటుందని కవిత అన్నారు. మండలకేంద్రంలోని భరతమాత కూడలి వద్ద రోడ్ షోలో మాట్లాడారు. సీఎం కేసీఆర్‌ను ఓడించే శక్తి కాంగ్రెస్, బీజేపీకి లేదన్నారు. కాంగ్రెస్, బీజేపీ మోసపూరిత మాటలు నమ్మవద్దన్నారు. ఎంపీపీ కాటిపెల్లి సరోజన, జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ గౌరు నాగేశ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పట్టణంలో సంజయ్ సతీమణి ప్రచారం

కోరుట్ల: పట్టణంలోని పలు వార్డుల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్ సతీమణి కల్వకుంట్ల దీప్తి ప్రచారం నిర్వహించారు. సీఎం కేసీఆర్ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య, కౌన్సిలర్లు, నాయకులు గుడ్ల మనోహర్ తదితరులు పాల్గొన్నారు. 16వ వార్డులో కౌన్సిలర్ బలిజ పద్మ రాజరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

గ్రామాల్లో ఎమ్మెల్యే కూతురు ప్రచారం

కోరుట్ల రూరల్:మండలంలోని ధర్మారం, కిషన్‌రావుపల్లెలో ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు కూతురు సమత ప్రచారం నిర్వహించారు. సంజయ్‌ను గెలిపించాలని ఇంటింటా ప్రచారం చేశారు. జెడ్పీటీసీ దారిశెట్టి లావణ్య, ఎంపీపీ తోట నారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి బీఆర్ఎస్ కృషి


జగిత్యాలలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

- ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట
- అందుకే ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు
- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్
- ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్సీ రమణ


ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న జెడ్పీచైర్‌పర్సన్, ఎమ్మెల్యే సతీమణి

జగిత్యాల: పేదల సంక్షేమం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మున్సిపాలిటీలు, గ్రామాల్లో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేసిందని తెలిపారు. గురువారం వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో మాట్లాడారు. ఎమ్మెల్సీ రమణ మాట్లాడుతూ జగిత్యాలను జిల్లా చేసుకోవడంతోపాటు అద్భుతంగా తీర్చిదిద్దుకున్నామని పేర్కొన్నారు.

బీర్‌పూర్‌లో ప్రచారం

సారంగాపూర్: బీర్‌పూర్, నర్సింహులపల్లె, కందెనకుంట, కండ్లపల్లి, చర్లపల్లి, రంగసాగర్, మంగేళ, కమ్మునూర్‌లో ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తనను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఆయన వెంట కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ ముప్పాల రాంచందర్‌రావు, మాజీ జెడ్పీటీసీ కొల్ముల రమణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు మద్దతుగా ప్రచారం

జగిత్యాలరూరల్: ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను మరోసారి గెలిపించాలని కోరుతూ జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, ఎమ్మెల్యే సతీమణి రాధిక ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జగిత్యాలరూరల్ మండలం హన్మాజీపేట, కన్నాపూర్‌లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఆసరా పింఛన్లు, రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ చేశారని పేర్కొన్నారు. సర్పంచ్ దామోదర్, సుధాకర్ పాల్గొన్నారు.

రాయికల్‌లో న్యాయవాదుల ప్రచారం


రాయికల్: ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని న్యాయవాదులు మైతాపూర్‌లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు.అల్లీపూర్‌లో ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. న్యాయవాదులు శ్రీపాల్‌రెడ్డి, రవీందర్‌కుమార్, చీటి రామకృష్ణ రావు, ఎర్ర నర్సయ్య, పవన్‌కుమార్, సురేశ్, శ్రీకాంత్, జీవన్, శశి, వరుణ్, హరిదాస్, అమర్‌దీప్, మహేందర్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

మండలంలోని ధర్మాజీపేటకు చెందిన మహిళలు ఎమ్మెల్సీ రమణ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. సీఎం కేసీఆర్ పథకాలు ప్రతి ఇంటికి చేరాయన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు కోల శ్రీనివాస్, సర్పంచ్ మారంపల్లి స్నేహ, మండల యూత్ అధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

నమోదు నుంచి లెక్కింపు దాకా..

- ఎన్నికల ప్రక్రియలో అధికారుల పాత్ర కీలకం
- పేర్లే వేరు.. అనేక బాధ్యతలు
- చిన్న పొరపాటు జరిగినా తీవ్ర పరిణామాలు



బుగ్గారం: ఎన్నికల ప్రక్రియ మొదలైనప్పటి నుంచి పూర్తయ్యే వరకు పలువురు అధికారులు ఎంతో కీలకంగా వ్యవహరిస్తేగానీ ఎన్నికల నిర్వహణ పూర్తికాదు. ఉన్నతస్థాయి అధికారి నుండి క్షేత్రస్థాయి అధికారుల వరకు ప్రతిఒక్కరూ బాధ్యతతో చిత్తశుద్ధితో పనిచేస్తేనే ఎలాంటి ఇబ్బందులూ లేకుండా ఎన్నికలు పూర్తవుతాయి. ఓటరు నమోదు నుంచి ఓట్ల లెక్కింపు వరకు బీఎల్‌వో నుంచి జిల్లా ఎన్నికల అధికారి వరకు సమన్వయంతో పనిచేస్తేనే ఎన్నికలు సజావుగా జరుగుతాయి. ఈ ప్రక్రియలో ఎవరు ఏ చిన్న పొరపాటు చేసినా తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతాయి. జిల్లాలో మొత్తం 18 మండలాలు మూడు అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. వీటి పరిధిలో మొత్తం 6,93,221 మంది ఓటర్లు ఉన్నారు. ఎన్నికల నిర్వహణ కోసం జిల్లాలో మొత్తం 785 పోలింగ్ స్టేషన్‌లు ఏర్పాటు చేశారు. వివిధ అధికారులు.. వారి విధులను పరిశీలిస్తే..

జిల్లా ఎన్నికల అధికారి

- జిల్లా ఎన్నికల అధికారిగా కలెక్టర్ వ్యవహరిస్తారు. క్షేత్రస్థాయిలో పనిచేసే వివిధ అధికారులకు విధుల కేటాయింపుతోపాటూ వారికి వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చే కార్యక్రమాలను పర్యవేక్షిస్తారు. ప్రతిరోజూ ప్రత్యేక సమీక్షల ద్వారా అధికారులకు దిశానిర్దేశం చేస్తూ జిల్లాలో ఎన్నికల ప్రక్రియను అంతాతానై నిర్వహిస్తారు. ఓటరు జాబితా తయారీ నుంచి ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన వరకు కలెక్టర్‌దే బాధ్యత.

రిటర్నింగ్ అధికారి

- ప్రతి నియోజకవర్గానికి ఒక రిటర్నింగ్ అధికారి ఉంటారు. వీరిని ఎన్నికల సంఘం నియమిస్తుంది. సాధారణంగా జిల్లాస్థాయిలో పనిచేసే అధికారులను ఆర్వోలుగా నియమిస్తారు. వీరు ఆయా నియోజకవర్గాలలో నామినేషన్ స్వీకరణ, పరిశీలన, తిరస్కరణ, అభ్యర్థుల జాబితా ప్రకటన, ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి వరకు ఆయనే బాధ్యత వహిస్తారు.

ఓటరు నమోదు అధికారులు

- ఓటరు జాబితాలో అర్హులైన వారిని చేర్చడం అనర్హులను తొలగించడంలో వీరి పాత్ర కీలకం. ఇందుకోసం మండల స్థాయిలో పనిచేసే అధికారులను నియమిస్తారు.

ప్రిసైడింగ్ అధికారి

- పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగడంలో ఓటర్లు తమ ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవడంలో వీరి పాత్ర కీలకం. ప్రతి పోలింగ్ కేంద్రానికి ఒక ప్రిసైడింగ్ అధికారిని నియమిస్తారు. పోలింగ్‌కు అవసరమైన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, ఇతర సామగ్రి వీరి ఆధీనంలోనే ఉంటుంది. పోలింగ్ కేంద్రం పూర్తి బాధ్యత పీవోదే. ప్రిసైడింగ్ అధికారితోపాటు మరో ముగ్గురు అదనపు ప్రిసైడింగ్ అధికారులు కేంద్రంలో విధులు నిర్వహిస్తారు. వీరు ఓట్లు వేయడానికి ముందే ఈవీఎంల పనితీరును పరిశీలించి సిద్ధంగా ఉంచుతారు.

బూత్ లెవల్ అధికారి

- గ్రామ, పట్టణస్థాయిలో పనిచేసేవారిని బూత్ లెవల్ అధికారిగా వ్యవహరిస్తారు. ఓటర్లను నమోదు చేయడంలో వీరి పాత్ర కీలకం. మండలస్థాయి అధికారుల పర్యవేక్షణలో ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులు వీరు చూసుకుంటారు. అందుకోసం అవసరమైన అన్ని రకాల దరఖాస్తు ఫారాలు వీరి వద్దే ఉంటాయి.



మూడోరోజు గంగాహారతి

ధర్మపురి: కార్తీకమాసం సందర్భంగా ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో మూడోరోజు గురువారం గంగాహారతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా దేవాలయం నుంచి గోదావరికి మేళతాళాలతో తరలివెళ్లారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించి గోదావరిలో దీపాలను వదిలారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు, అర్చకులు, సిబ్బంది తదితరులున్నారు.

క్లుప్తంగా

రూ.1.50 లక్షలు పట్టివేత



నగదు చూపుతున్న ఎస్‌ఐ నవీన్‌కుమార్

మెట్‌పల్లి: పట్టణంలోని వెంకట్రావ్‌పేట శివారులో పోలీసులు గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఓ వ్యక్తి కారులో ఎలాంటి పత్రాలు లేకుండా రూ.1.50 లక్షలు తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు. ఆ మొత్తాన్ని గ్రీవెన్స్ కమిటీకి అప్పగించినట్లు పేర్కొన్నారు.

రామాజీపేట శివారులో రూ.68 వేలు

రాయికల్: మండలంలోని రామాజీపేట శివారులో గురువారం సాయంత్రం ఎస్‌ఐ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఓ వ్యక్తి వద్ద రూ.68 వేలు పట్టుకున్నారు. సంబంధిత పత్రాలు చూపించకపోవడంతో సీజ్ చేసి, గ్రీవెన్స్ సెల్‌కు అప్పగించినట్లు తెలిపారు.

ఒబులాపూర్ చెక్‌పోస్టు వద్ద రూ.80 వేలు

మల్లాపూర్: మండలంలోని ఒబులాపూర్ చెక్‌పోస్టు వద్ద గురువారం ఓ కారులో తరలిస్తున్న రూ.80 వేలను పట్టుకున్నట్లు ఎస్‌ఐ నవీన్‌కుమార్ తెలిపారు. వాహనాలను తనిఖీ చేస్తుండగా ఓ వ్యక్తి కారులో నగదు తీసుకెళ్తూ పట్టుబడ్డాడని అన్నారు. సంబంధిత పత్రాలు చూపించకపోవడంతో సీజ్ చేసి, గ్రీవెన్స్ సెల్‌కు అప్పగించినట్లు పేర్కొన్నారు. హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుళ్లు ఉన్నారు.

బస్సు ఎక్కుతుండగా ఆభరణాలు చోరీ

జగిత్యాల రూరల్: ఓ ప్రయాణికుడి వద్ద ఉన్న ఆభరణాలను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. వివరాల్లోకి వెళ్తే.. జగిత్యాల జిల్లా కేంద్రంలోని వంజరివాడకు చెందిన రమణయ్య బుధవారం తన కుటుంబసభ్యులతో కలిసి నిజామాబాద్ వెళ్లేందుకు స్థానిక కొత్త బస్టాండ్‌కు వెళ్లాడు. ఆర్టీసీ బస్సు ఎక్కుతుండగా దొంగలు రూ.2.80 లక్షల విలువైన ఆభరణాలున్న ఆయన బ్యాగును చోరీ చేశారు. బాధితుడు గురువారం జగిత్యాల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అబ్దుల్ రహీం తెలిపారు.

కుక్కల దాడిలో 11 మందికి గాయాలు



ఆస్పత్రికి వెళ్తి వస్తున్న బాధితులు

ధర్మపురి: కుక్కల దాడిలో 11 మందికి గాయపడ్డారు. ధర్మపురిలోని గంగపుత్ర కాలనీలో గురువారం కుక్కలు గుంపుగా సంచరించాయి. స్థానికులైన నాగుల సుధ, గరిగె రోషన్, కన్నారి వర్ష, ప్రణీష్ తదితరులపై దాడి చేశాయి. తీవ్రంగా గాయపడిన వర్ష, ప్రణీష్‌లను స్థానికులు అంబులెన్సులో జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. మిగతావారికి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం చేయించారు. కుక్కల బారినుంచి తమను కాపాడాలని మున్సిపల్ అధికారులను కోరుతున్నారు.

నల్లకోటు వీడి.. చట్టసభల్లోకి



ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా ఎన్నికైన న్యాయవాదులు

- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 30 మంది
- వీరిలో పలువురిని వరించిన మంత్రి పదవి
- భారత ప్రధాని పీవీ నర్సింహారావు లాయరే..
- మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు కూడా..



పీవీ నర్సింహారావు



శ్రీపాదరావు



టి.జీవన్‌రెడ్డి



వినోద్‌కుమార్



విద్యాసాగర్‌రావు



ప్రభాకర్‌గౌడ్



ఆరెపల్లి మోహన్



రాజేశంగౌడ్



ఎమ్మెస్సార్



బొమ్మ వెంకన్న



మృత్యుంజయం



సి.ఆనందరావు



రాజేశ్వర్‌రావు



డి.శ్రీధర్‌బాబు

సిరిసిల్ల: న్యాయశాస్త్రం చదువుకున్న పలువురు న్యాయవాద వృత్తిని వీడి, చట్టసభల్లో అడుగుపెట్టారు. రాజకీయాల్లో అతిరథమహారథులుగా పేరొందిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా నేతలు వకీళ్లుగా కోర్టుల్లో నల్లకోటు వేసినవారే. భారత ప్రధానిగా సేవలందించిన బహుభాషావేత్త పీవీ నర్సింహరావు, మహారాష్ట్ర మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు కూడా న్యాయవాదులే. ఇలా ఉమ్మడి జిల్లాలో ఏకంగా 30 మంది ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా ఎన్నికయ్యారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వకీల్‌గా జీవితాన్ని ప్రారంభించి, ప్రజాప్రతినిధిగా ఎన్నికైనవారిపై కథనం.

తొలి ఎన్నికల్లోనే..

ఉమ్మడి జిల్లాలో 1952లో తొలిసారి జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సీనియర్ న్యాయవాది ఏలేటి రాజిరెడ్డి సుల్తానాబాద్ నుంచి విజయం సాధించారు. మంథని నుంచి సోషలిస్టు అభ్యర్థి గుల్లకోట శ్రీరాములు, సిరిసిల్ల నుంచి జె.ఆనందరావు(పీడీఎఫ్) గెలిచారు. 1957లో సుల్తానాబాద్ నుంచి పి.రామచంద్రారావు(పీడీఎఫ్), చొప్పదండి నుంచి చెన్నమనేని రాజేశ్వర్‌రావు(పీడీఎఫ్), మెట్‌పల్లి నుంచి జె.ఆనందరావు(పీడీఎఫ్) ఎన్నికయ్యారు. 1957లోనే మంథని నుంచి గెలిచిన పీవీ నర్సింహారావు మూడుసార్లు ఎమ్మెల్యే అయ్యారు. రాష్ట్ర మంత్రిగా, ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా, దేశ ప్రధానిగా ఆయన సేవలందించారు. హైదరాబాద్‌లో ఆయన మొదట్లో న్యాయవాదిగా ఉన్నారు.

రాష్ట్ర మంత్రులైనవారు వీరే..

న్యాయవాదిగా పని చేసిన పలువురు ఎమ్మెల్యేలుగా గెలిచి, రాష్ట్ర మంత్రులుగా పని చేశారు. కరీంనగర్ నుంచి ఎన్నికైన చల్మెడ ఆనందరావు ఎన్టీఆర్ మంత్రివర్గంలో న్యాయశాఖ మంత్రిగా సేవలందించారు. జగిత్యాల నుంచి గెలిచిన జి.రాజేశంగౌడ్, 1987లో ఎమ్మెల్యే అయిన టి.జీవన్‌రెడ్డి, 2004లో కరీంనగర్ నుంచి గెలిచిన ఎం.సత్యనారాయణరావు, మంథని ఎమ్మెల్యేగా గెలిచిన దుద్దిళ్ల శ్రీధర్ బాబులను మంత్రి పదవి వరించింది.

1985లో మెట్‌పల్లి నుంచి విజయం సాధించిన చెన్నమనేని విద్యాసాగర్‌రావు న్యాయవాద వృత్తి చేపట్టినవారే. ఆయన మూడుసార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు ఎంపీగా, కేంద్ర మంత్రిగా, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలకు గవర్నర్‌గా పని చేశారు.

స్పీకర్‌గా శ్రీపాదరావు..

న్యాయవాద వృత్తి నుంచి వచ్చినవారిలో మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీపాదరావు ప్రముఖుడు. 1983, 1985, 1989 ఎన్నికల్లో గెలిచిన ఆయన శాసనసభ స్పీకర్‌గా ఎక్కువ కాలం పని చేశారు. ఆయన కుమారుడు శ్రీధర్‌బాబు కూడా లాయరే. 1999, 2004, 2009, 2018లో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. రాష్ట్ర మంత్రిగానూ సేవలందించారు.

జంగ్ తెలంగాణ

మరికొందరు..

1963లో జగిత్యాల నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా గెలిచిన కాసుగంటి లక్ష్మీనర్సింహారావు న్యాయవాదిగా పని చేశారు. 1967 ఎన్నికల్లో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికై, రికార్డు సృష్టించారు. 1985లో నేరెళ్ల నుంచి గెలిచిన ఉప్పరి సాంబయ్య, 1983లో కరీంనగర్ స్థానం నుంచి సంజయ్ విచార్‌మంచ్ అభ్యర్థిగా గెలిచిన కటకం మృత్యుంజయం, 1989లో హుజూరాబాద్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధించిన కె.సాయిరెడ్డి, 1994లో టీడీపీ అభ్యర్థిగా గెలిచిన జువ్వాడి చంద్రశేఖర్‌రావు, 1999లో కాంగ్రెస్ అభ్యర్థిగా ఇందుర్తిలో విజయం సాధించిన బొమ్మ వెంకటేశ్వర్లు, 1999లో మెట్‌పల్లి నుంచి గెలిచిన కొమొరెడ్డి జ్యోతి, 2004లో ఎన్నికైన కొమొరెడ్డి రామ్‌లు, 2009లో మానకొండూరు నుంచి గెలిచిన ఆరెపల్లి మోహన్, 2009లో కరీంనగర్ నుంచి ఎంపీగా విజయం సాధించిన పొన్నం ప్రభాకర్‌గౌడ్‌లు న్యాయశాస్త్రం చదివినవారే కావడం విశేషం. నల్లకోటు వీడి ఎన్నికల బరిలో నిలిచిన పలువురు విజయం సాధించగా ఎంతోమంది న్యాయవాదులు ఓటమిపాలయ్యారు. చట్టసభల్లో సక్సెస్ అయిన నేతలెందరో ఉమ్మడి జిల్లాకు మంచిపేరు తీసుకువచ్చారు.

లీడర్లకు తప్పని ఇంటి పోరు

- పొద్దున పోతే రాత్రయ్యాకే ఇంటికి..
- నిత్యం కుటుంబంలో గొడవ
- ఎన్నికల ప్రచారం నేపథ్యంలో చోటామోటా నాయకుల తిప్పలు

కోరుట్ల: పొద్దుగాల.. ఏడు గంటల సమయం. ఊరి చోటా లీడర్ గంగాధర్ ఫోన్ ట్రింగ్.. ట్రింగ్ అని మోగుతోంది. రాత్రి ఇంటికి లేటుగా వచ్చిన అతను అబ్బా.. అని మత్తు వదిలించుకుంటూ మంచం మీద నుంచి లేచి ఫోన్ ఎత్తాడు. అన్నా ఇగో.. రెండు నిమిషాల్లో వస్తున్నా.. హోటల్ కాడ ఉండుండ్రి.. అని చెప్పి, పెట్టేసిండో లేదో.. ఇంటి పోరు మొదలైంది. గంగాధర్ భార్య లక్ష్మి ఒక్కసారిగా మాటల జోరు పెంచింది. అది హోరుగా మారింది. ఇంతకీ ఆ ఇంటి మహాలక్ష్మి మాటల జోరేంది.. ఆ ముచ్చటేంది.. ఓసారి తెలుసుకుందాం.

- **లక్ష్మి:** అనుకున్న.. ఇయ్యాల ఆ దరిద్రపు ఫోన్ ఇంకా వస్తలేదని.. రానే వచ్చింది. ఇగ ఇప్పుడు పోతే.. ఏ వేళకు ఇంటికి వస్తవో?

గంగాధర్: అవ్.. లక్ష్మి.. మా పార్టీ పెద్ద మనిషి ఫోన్ చేసిండు. ఇయ్యాల మన పక్క ఊరిలో ప్రచారమట. ఏడు వరకే ఉండమన్నడు.. నువ్ పొద్దున్నే లేపొద్దా?

- **లక్ష్మి:** గీ ఫోన్.. పదిహేను రోజుల నుంచి గిట్లనే వస్తుంది. పొద్దుగాల ఏడు కావాల.. ఎవరో ఒకరు ఫోన్ చెయ్యాల.. పార్టీ మీటింగ్‌లు.. ప్రచారం అనుకుంట నువ్ పొద్దుమాపు తిరిగి అర్ధరాత్రి వేళ ఇంటికి రావాలె..

గంగాధర్: మరి ఏందనుకున్నవే లీడర్ అంటే.. మా పార్టీ పెద్ద మనిషికి నేను లేకుంటే నడ్వదు. అన్ని ఊళ్లకు నన్నే పిలుస్తడు. ఈసారి ఆయన ఎంబడి ఉండి, గట్టిగా తిరిగి ఎట్లన్న జేసి, పార్టీని గెలిపించుకోవాలె.

- **లక్ష్మి:** అవ్ మల్ల. మీ పార్టీని గెలిపించుకోవడానికి మస్తు తిరుగుతున్నవ్.. కానీ ఇంటి సంగతేంది. ఇంట్ల ఏమన్న ఉన్నదా.. లేదా చూసుకోవాల్నా.. లేదా?

గంగాధర్: అగో.. మొన్ననే ఇంట్లకు అన్ని తెచ్చిపెడితిని కదా.. ఇంకేం కావాలా.. ఎప్పుడు గిదే లొల్లి.. ఏం పనిచేసుకోనియ్యవ్.

- **లక్ష్మి:** మొన్న తెచ్చినవా? ఎన్ని రోజులవుతుందో.. ఏమన్నా కాల్లి ఉన్నదా నీకు? పొద్దుగాల లేసి పార్టీ.. పార్టీ అనుకుంట పోతున్నవ్. ఇంటి సామాన్లు తెచ్చి, ఇరవై రోజులైంది. అప్పటి నుంచి ఏం పట్టించుకుంటలేవ్.. నేను ఎట్ల ఎల్లదియ్యాలె?

గంగాధర్: అరే.. గిదేం లొల్లి మోపుజేసినవే? ఆడ మా పార్టీ గెలుస్తదా.. లేదా అని మేం పరేషాన్‌లో ఉన్నం.. నువ్వేమో గిట్ల తలిగినవ్.

- **లక్ష్మి:** అవ్ మరి.. పదిహేను రోజుల నుంచి పొద్దుగాల లేచి టిఫిన్ కాడికెళ్లి బిర్యానీ దాకా బయట తిని, రాత్రి పూట మంచిగ తాగి వస్తున్నవ్.. నీకేం తెలుస్తయ్ ఇంట్ల నా తిప్పలు. బడి సారు చిన్నపోరని ఫీజు పైసలు కట్టమని అడిగితే పక్కింటి సరోజను అడిగి తెచ్చి, కట్టిన. పెద్ద పిల్ల బడిలో టూర్ పోతున్నరని 2 వేలు కావాలని చెప్పింది. ఇంట్లో కిరాణా సామాను అయిపోయింది. గివన్నీ జెప్తమంటే.. పొద్దుగాల్నే ఫోన్ రావట్టే.. బిరబిర ఉర్కవడితివి.

గంగాధర్: సరేగానీ అవన్నీ నేను చూసుకుంట.. మా సారు గెలుస్తే గీ తిప్పలే ఉండవ్.. జల్ది చాయ్ పెట్టు. నేను పోవాలా.. మీటింగ్‌కు లేటవుతుంది.. నా కోసం కారు ఆపిండ్రు.

- **లక్ష్మి:** చాయ్ పెట్టాల్నా.. ఎట్ల పెట్టాలె? పాల నారాయణ పైసలు ఇవ్వలేదని పాలు పోసుడు బంజేసిండు. చాపత్త లేదు. చెక్కరి అయిపోయింది. పో.. పో అక్కడ నీ కోసం చూస్తున్నరు కదా. వాళ్లే నీకు చాయ్, మందు అన్నీ పోస్తరు. నేను ఎట్లనో బాకీలు చేసి, తిప్పలు వడ్త.
- 'సరే.. సరేలే.. నేను ఇయ్యాల జల్ది వస్తా.. అన్నీ తెస్తా.. అని చెప్పుకుంట గంగాధర్ బండి తీసుకొని ఇంట్లకెళ్లి, బయటవడ్డడు.
- నిజంగా జల్ది వస్తడంటారా? ఎన్నికలు ముగిసేదాకా ఇల్లువాకిలి పట్టించుకోకుండా గిట్లనే తిరుగుతడా.. అనేది మనకు బేతాళ ప్రశ్న. ఇదీ ఎన్నికల సమయంలో చోటామోటా లీడర్ల ఇళ్లల్లోని ఇంటి పోరు తీరు.

తాగుడు లేకపాయె.. లొల్లి తక్కువాయె

- బెల్టుషాపులు, గుడుంబా విక్రయాలపై పోలీసుల ఉక్కుపాదం
- మందుబాబుల జోరుకు అడ్డుకట్ట
- పల్లెల్లో ప్రశాంత వాతావరణం

పెగడపల్లి: అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గర పడుతోంది. పోలీసులు, అబ్కారీశాఖ అధికారులు గ్రామాల్లో తనిఖీలు ముమ్మరం చేస్తున్నారు. బెల్టుషాపులు, గుడుంబా తయారీ, విక్రయాలపై ఉక్కుపాదం మోపుతున్నారు. అక్రమంగా మద్యం విక్రయిస్తే కేసులు నమోదు, బెల్టుషాపుల నిర్వహకుల ను గుర్తించి, ముందస్తుగా బైండోవర్ చేస్తున్నారు. బైండోవర్ చేసిన తర్వాత కూడా విక్రయించే వారిపై కేసులు నమోదు చేయడంతోపాటు పెద్ద మొత్తంలో జరిమానా విధిస్తున్నారు. ఫలితంగా పల్లెల్లో మందుబాబుల జోరు తగ్గి, ప్రశాంత వాతావరణం ఏర్పడింది. ఈ పరిణామాలపై ఓ గ్రామంలో రాజక్క, రాణక్క అనే ఇద్దరు మహిళలు ఇలా సంభాషించుకున్నారు.

- **రాజక్క:** ఏం రాణక్కా.. బాగున్నవా?

రాణక్క: ఆ.. ఇప్పుడు ప్రశాంతంగా ఉంటున్న.

- **రాజక్క:** ఎందుకు? ఇన్ని రోజుల నుంచి లేవా ఏంది?

రాణక్క: ఆ.. ఏం ప్రశాంతత.. నా పెనిమిటి పొద్దంతా కూలీకెళ్లి, రోజూ సాయంత్రం తప్పతాగచ్చి, ఒకటే లొల్లి చేసేవాడు. గీ ఎన్నికల పుణ్యమాని ఊల్లె మందు దుకాణాలను మొన్నటి నుంచి పోలీసోల్లు బందు చేయించుండ్రు. ఇగ, నా పెనివిటి తాగుడు తగ్గించిండు. లొల్లి గూడా తక్కువైంది.

- **రాజక్క:** అవును.. మా ఊల్లె గూడా గీ మందు దుకాణాలు తీత్తలేరు. ఎందుకో అనుకున్న.

రాణక్క: ఇది ఎలచ్చన్ల సమయం. గిప్పుడు పాలనంత గా ఎన్నికల సంఘమొల్ల చేతిలో ఉందట. గీ నాయకులు చెప్పినవి ఇనరట. గా ఎన్నికల సంఘం అధికారులు చెప్పడంతో పోలీసోల్లు అబ్కారీ సార్లు ఊర్లల్ల మందు దుకాణాలను చెకింగ్ చేస్తున్నరు. కల్లు అమ్మద్దని చెప్తుండ్రు. అమ్మితే జైళ్లవెద్తరట.

- **రాజక్క:** గదా సంగతి.. మా ఊల్లె ఇంతకుముందు ఇంటికో దుకాణంలో కల్లు అమ్మేటోళ్లు. అందరు తాగేటోళ్లు. లొల్లులు పెట్టుకునేటోళ్లు. గిప్పుడు గా దుకాణాల్లో కల్లు అమ్ముతలేరు. ఎవరూ అత్తలేరు. లొల్లులు లేక ఊరు సల్లగుంది. ఎప్పుడు గిట్లనే ఉంటే మంచిగుండు.

రాణక్క: ఎప్పుడు గిట్లుంటే గా అధికారులకు ముల్లెలెట్ల వస్తయి. గీ ఎలచ్చన్ల వరకే గిట్లుంటదట. కొత్త సర్కారు వచ్చినంక మల్ల అందరు మొదట్లెక్కనే అమ్ముకుంటరట.

- **రాజక్క:** అయితే ఎప్పటికి గీ ఎన్నికల సంఘమే పాలిస్తె మంచిగుండు. ఇప్పుడే మంచిగుంది.

రాణక్క: గట్లెట్ల కుదుర్తది. మనది ప్రజాస్వామ్య దేశం. మన పాలకులను మనమే ఎన్నుకోవాలె.

- **రాజక్క:** మరి గెలిచినంక గీ పాలకులు కూడి గిట్ల చెయ్యచ్చు కదా?

రాణక్క: గట్ల చేస్తే సర్కారుకు ఆదాయం ఎట్లొస్తది? మనోళ్లు తాగుబోతులుగా మారాలె. ఆరోగ్యం చెడిపోవాలె. కుటుంబాలు ఆగం కావాలె. మనోళ్లు తాగితే వచ్చే పైసలతో అభివృద్ధి పేరిట ఆళ్ల జేబులు నింపుకోవాలె.

- **రాజక్క:** అలాంటోళ్లకు మనమెందుకు ఓటెయ్యాలె?

రాణక్క: గందుకే కల్లు పోస్తమని, పైసలిస్తమని అచ్చేటోళ్లను తరిమికొట్టాలె. మంచోళ్లనే గెలిపియ్యాలె.

ఓటర్లను మభ్యపెడితే కఠినచర్యలు

- డీఎస్పీ వెంకటస్వామి

సారంగాపూర్: ఓటర్లను మభ్యపెట్టి, తాయిళాలు ఇచ్చి, ఓటు వేయించేందుకు ప్రయత్నిస్తే కఠినచర్యలు తీసుకుంటామని డీఎస్పీ వెంకటస్వామి హెచ్చరించారు. సారంగాపూర్ మండలంలోని పలు పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీసులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయా గ్రామాల్లో ప్రజలతో మాట్లాడుతూ.. ఎవరైనా ఎన్నికల నియమావళిని ధిక్కరించేలా వ్యవహరిస్తే తమకు ఫిర్యాదు చేయాలన్నారు. ఓటర్లకు మద్యం, డబ్బులు, వస్తువులు పంపిణీ చేసేవారిపై కఠినంగా వ్యవహరిస్తామని పేర్కొన్నారు. పెద్ద మొత్తంలో నగదు, ఇతర వస్తువులను తీసుకెళ్తే సంబంధిత పత్రాలు చూపించాలన్నారు. లేకపోతే వాటిని సీజ్ చేసి, ఎన్నికల టీంకు అప్పగిస్తామని తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి అందరూ సహకరించాలని కోరారు. ఆయన వెంట సారంగాపూర్ ఎస్‌ఐ తిరుపతి, సిబ్బంది ఉన్నారు.



లక్ష్మీదేవిపల్లిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకటస్వామి

వ్యాసరచన పోటీలు

రామడుగు(చొప్పదండి): గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ వారు సాంఘీకశాస్త్రం సబ్జెక్టుపై గురువారం కరీంనగర్‌లో జిల్లాస్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. రామడుగు మండలంలోని రుద్రారం హైస్కూల్‌కు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని గోనె వైష్ణవి ప్రతిభ కనబరిచి, నాలుగో స్థానంలో నిలిచింది. ఆమెను డీఈవో జనార్దన్‌రావు అభినందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వైష్ణవిని అభినందిస్తున్న డీఈవో జనార్దన్‌రావు

పోలింగ్ కేంద్రాల్లో గుర్తింపు కార్డుల ఫ్లెక్సీలు

జగిత్యాల: జిల్లాలో పోలింగ్ శాతం పెంచేందుకు అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు పోలింగ్ కేంద్రాల్లో గుర్తింపు ధ్రువీకరణకు సంబంధించిన 13 రకాల గుర్తింపు కార్డుల పేర్లతో ఉన్న ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నారు. పోలింగ్ కేంద్రానికి వెళ్లే ప్రతిఒక్కరూ తమకు ఏ కార్డు ఉన్నా ఓటు వేయవచ్చని అర్థమయ్యేలా వీటిని తయారు చేయించారు.



రకాల గుర్తింపు కార్డుల పేర్లతో ఉన్న ఫ్లెక్సీ

రాష్ట్రస్థాయి కళోత్సవ్ పోటీల్లో ప్రతిభ

రాయికల్(జగిత్యాల): మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న సాహిత్య రాష్ట్రస్థాయి కళోత్సవ పోటీల్లో స్వదేశీ బొమ్మల తయారీ విభాగంలో తృతీయ బహుమతి సాధించినట్లు ప్రిన్సిపాల్ శోభారాణి గురువారం తెలిపారు.



సాహిత్య

వందశాతం పోలింగ్‌కు చర్యలు

- గతంలో తక్కువ శాతం నమోదైన ప్రాంతాలపై దృష్టి
- ఈసారి ఈవీఎంలపై అభ్యర్థుల ఫొటోలు, గుర్తులు
- జిల్లాలో 785 పోలింగ్ కేంద్రాలు

జగిత్యాల: ఈ నెల 30న జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికల సంఘం 2018 ఎన్నికల్లో ఈవీఎంలకు వీవీప్యాట్‌లను ఏర్పాటు చేసి, ఓటరు ఏ గుర్తుకు ఓటు వేశారో తెలుసుకునే అవకాశం కల్పించింది. ఈసారి గుర్తుతోపాటు, అభ్యర్థి ఫొటోను ముద్రించింది. దీనివల్ల ఓటర్లు తాను ఎవరికి ఓటు వేశామో చూసుకునే వీలు కలుగుతుంది. ఎన్నికల్లో ప్రతీ ఒక్కరు ఓటు వేయాలని జిల్లా ఎన్నికల అధికారి యాస్మిన్ బాషా కోరారు. జగిత్యాల జిల్లాలో జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి నియోజకవర్గాలున్నాయి. మొత్తం 785 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

నియోజవర్గానికి 5 ప్రత్యేక కేంద్రాలు..

ఈసారి వందశాతం పోలింగ్ నమోదయ్యేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గతంలో జిల్లాలోని ఏయే ప్రాంతాల్లో తక్కువ పోలింగ్ నమోదైందో వివరాలు సేకరించారు. మై ఓటరు హెల్ప్‌లైన్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. దీని ద్వారా కొత్త ఓటు నమోదు చేసుకోవడంతోపాటు ఓటు ఉందో లేదో తెలుసుకోవచ్చు. అలాగే, మోడల్, ఆదర్శ, యువత, మహిళలు, దివ్యాంగుల కోసం నియోజకవర్గానికి 5 చొప్పున ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎన్నికల్లో అక్రమాలపై సీ-విజిల్ యాప్‌లో ఫొటో, వీడియోలతో ఫిర్యాదు చేస్తే నేరుగా జిల్లా ఎన్నికల అధికారికి చేరుతాయి. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలే వెంటనే సంఘటన స్థలానికి వెళ్లి, చర్యలు తీసుకుంటాయి.

పోస్టల్ బ్యాలెట్ ఓటర్లు 1586 మంది

జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటువేసేవారు 1586 మంది ఉన్నారు. గతంలో ఎన్నికల విధుల ఉద్యోగులు, అధికారులు ఎన్నికల విధులకు హాజరయ్యే ముందు ఓటు వేసేవారు. కానీ ఈసారి పోలింగ్ ప్రారంభానికి ముందే పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కు వినియోగించుకునే అవకాశం కల్పించారు.



ఈవీఎంలపై అభ్యర్థుల ఫొటోలు, గుర్తులు

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన





బతికపల్లి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ, ఎస్‌ఐ, సిరికొండలో పరిశీలిస్తున్న సీఐ, ఎస్‌ఐ

కథలాపూర్: మండలంలో గుర్తించిన సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను కోరుట్ల సీఐ ప్రవీణ్‌కుమార్ గురువారం పరిశీలించారు. సిరికొండ, కథలాపూర్, తాండ్ర్యాల, చింతకుంట, తక్కళ్లపెల్లి గ్రామాల్లో పర్యటించారు. పోలింగ్ రోజు వివాదాలు తలెత్తితే తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. ఆయన వెంట కథలాపూర్ ఎస్సై కిరణ్‌కుమార్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

వసతుల కల్పనపై ఆరా..

పెగడపల్లి: సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంటుందని ఎస్‌బీ డీఎస్పీ, ధర్మపురి నియోజకవర్గ ఎన్నికల నోడల్ అధికారి కె.రవీంద్ర కుమార్ అన్నారు. పెగడపల్లి మండలంలోని పలు గ్రామాల్లో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఎస్‌ఐ సతీశ్‌తో కలిసి గురువారం సాయంత్రం పరిశీలించారు. వసతుల కల్పనపై ఆరా తీశారు. ఈ నెల 30న అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. గతంలో ఘర్షణ పడటం, ఉద్రిక్తత చోటు చేసుకున్న పోలింగ్ కేంద్రాల వద్ద ఈసారి ప్రత్యేక భద్రతా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

గుండెపోటుతో ఇంజినీరింగ్ విద్యార్థిని మృతి

సిరిసిల్ల: సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూనగర్‌కు చెందిన ఇంజినీరింగ్ విద్యార్థిని గెంట్యాల ప్రదీప్తి(18) గురువారం గుండెపోటుతో మృతి చెందింది. ప్రదీప్తి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కాలేజీలో ఇంజినీరింగ్ రెండో సంవత్సరం చదువుతోంది. మంగళవారం సాయంత్రం కాలేజీలో హఠాత్తుగా గుండెపోటుకు గురికావడంతో ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం మరణించింది. ప్రదీప్తి హఠాన్మరణంతో ఆమె తల్లిదండ్రులు గెంట్యాల రేణుక-భూమేశ్‌లు శోకసంద్రంలో మునిగిపోయారు. ప్రదీప్తి మృతదేహాన్ని అంబులెన్స్‌లో సిరిసిల్లలోని స్వగృహానికి తరలించారు. కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. చిన్న వయసులోనే ఇంజినీరింగ్ విద్యార్థిని గుండెపోటుతో మరణించడం సిరిసిల్లలో విషాదం నింపింది.



ప్రదీప్తి (ఫైల్)

కువైట్‌లో అనంతపల్లి వాసి మృతి

చందుర్తి (వేములవాడ): జీవనోపాధి కోసం గల్ఫ్ వెళ్లిన ఓ యువకుడిని విధి గుండెపోటు రూపంలో బలి తీసుకుంది. ఈ సంఘటన చందుర్తి మండలం అనంతపల్లి గ్రామంలో గురువారం విషాదాన్ని నింపింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. అనంతపల్లి గ్రామానికి చెందిన బుర్ర గంగాధర్‌గౌడ్(44) ఉపాధి కోసం మూడేళ్ల క్రితం కువైట్ వెళ్లాడు. అక్కడ పెట్రోల్ బంక్‌లో పని చేస్తున్నాడు. ఇటీవల స్వగ్రామానికి వచ్చి రెండు నెల క్రితం మళ్లీ కువైట్‌కు వెళ్లాడు. బుధవారం తాను పనిచేస్తున్న సమయంలోనే గుండెనొప్పి రావడంతో అతడి స్నేహితులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఫోన్ ద్వారా మృతుడి బంధువులకు సమాచారం అందింది. మృతుడికి భార్య లక్ష్మి, కుమారుడు మనివర్ధన్, కూతురు మణిదీప్తిలు ఉన్నారు.



గంగాధర్‌గౌడ్ (ఫైల్)